క్లుప్తంగా

అప్రమత్తతతో అగ్నిప్రమాదాల నుంచి రక్షణ



ఆసుపత్రిలో అగ్నిప్రమాదాలపై వివరిస్తున్న సిబ్బంది

నిడదవోలు: సరైన జాగ్రత్తలు పాటిస్తే అగ్ని ప్రమాదాలను నివారించవచ్చునని జిల్లా అసిస్టెంట్ అగ్నిమాపకాధికారి కె. శ్రీనివాసరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు శనివారం పట్టణంలో పెట్రోల్ బంకులు, విజయదుర్గ గ్యాస్ ఏజెన్సీ, ఎస్కేఎస్ ఆసుపత్రిలో అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు వాటిని నియంత్రించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను అగ్నిమాపక సిబ్బంది ప్రయోగాత్మకంగా వివరించారు. అగ్ని నిరోధకాల ద్వారా వాటిని ఏ విధంగా నియంత్రించాలో వాల్‌పోస్టర్ల ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ యాజమాన్యం, సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

పెట్రోల్ బంకులో తనిఖీ

నల్లజర్ల: మండలంలోని గంటావారిగూడెంలోని పెట్రోల్ బంక్‌లో కొలతలు, నాణ్యతలో తేడాలు వస్తున్నట్టు వినియోగదారుల ఫిర్యాదుల మేరకు శనివారం తూనికలు, కొలతలు శాఖ అధికారులు తనిఖీలు చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అన్నీ సక్రమంగానే ఉన్నాయన్నారు. వినియోగదారుల అనుమానాలను నివృత్తి చేయడానికి తనిఖీలు చేసినట్టు లీగల్‌మెట్రాలజీ (వెయిట్స్, మెజర్‌మెంట్స్)శాఖ అసిస్టెంట్ బి.సాయిరాం తెలిపారు. తనిఖీల్లో అసిస్టెంట్ సివిల్ సప్లయి అధికారి ఎం.నాగాంజనేయులు, లీగల్ మెట్రాలాజీ ఎస్‌ఐ జీవీ ప్రసాద్, సివిల్ సప్లయి డీటీ సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

తాళ్లపూడి: తాళ్లపూడిలోని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం సమీపంలో తాళ్లపూడి క్రీస్తు సంఘం ఆధ్వర్యంలో సంఘం డైరెక్టర్ పీడీ సుందరరావు పిలుపు మేరకు శనివారం చలివేంద్రాన్ని తాళ్లపూడి మాజీ సర్పంచ్, మండల టీడీపీ అధ్యక్షుడు నామన పరమేశ్వరరావు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో క్రీస్తు సంఘ కాపరి రాజేష్‌కుమార్, సంఘం తాళ్లపూడి సభ్యులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతోనే భూ సంరక్షణ సాధ్యం

కొవ్వూరు: ప్రతి రైతు నవధాన్యాల సాగు ద్వారా భూసారాన్ని సంరక్షించుకోవాలని జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎస్.మాధవరావు అన్నారు. దొమ్మేరులో పీఎండీఎస్ నవధాన్యాల సాగుపై శనివారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు మేనేజర్ తాతారావు పచ్చిరొట్ట పంటగా నవ ధాన్యాలు సాగు చేయాలని సూచించారు. ఏడీఈ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి రైతు సేవా కేంద్రంలో పీఎండీఎస్ కిట్లు అందుబాటులో ఉంచామని వాటిని సద్వినియోగపరుచుకోవాలని సూచించారు. ఈసందర్భంగా ఉత్తమ రైతులను సన్మానించారు.రైతులకు నవధాన్యాల కిట్లును అందజేశారు.సర్పంచ్ తానేటి కుమారి, మండల వ్యవసాయ శాఖాధికారి ఎ.గంగాధరరావు పాల్గొన్నారు.

బుర్రిలంకలో అగ్ని ప్రమాదం

కడియం: కడియపులంక పంచాయతీ పరిధిలోని బుర్రిలంకలో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో పి.కొండారత్నం, ఎం.త్రివేణిలకు చెందిన రెండు ఇళ్లు కాలిబూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రెండు లక్షలకు పైగా ఆస్తినష్టం సంభవించిందని బాధితులు తెలిపారు. ప్రమాదానికి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణమని చెబుతున్నారు. కాగా స్థానికులు వెంటనే అగ్నిమాపక కేంద్రాన్ని సమాచారం ఇవ్వడంతో వారు సంఘన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. బాధిత కుటుంబాలను పరామర్శించి సర్పంచ్ పాటంశెట్టి రాంజీ రూ.10వేలు, స్థానికులు నూనె ప్రభు రూ.5వేలు ఆర్థిక సాయంగా అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

ధవళేశ్వరం: ఈస్టర్ పర్వదినం సందర్భంగా ధవళేశ్వరంలోని క్రైస్తవ సమాధుల వద్ద బాగుజేస్తున్న వారికి వైఎస్సార్ సీపీ నాయకుడు మిరప రమేష్ ఆధ్వర్యంలో శనివారం మజ్జిగను పంపిణీ చేశారు. మిరప రమేష్ నానమ్మ మిరప వజ్రమ్మ జ్ఞాపకార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి వందలాది మందికి మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాకే పవన్, తేజ, మహేష్, విల్సన్, కుమార్, శ్రీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను చెల్లింపులకు ప్రత్యేక కౌంటర్లు

రాజమహేంద్రవరం సిటీ: గత ఏడాది ఆర్థిక సంవత్సరంలో బకాయి ఉన్న పన్నులపై వడ్డీ రాయితీ 50శాతం, అలాగే 2025–26 ఆర్థిక సంవత్సరం పన్ను ఏక మొత్తంగా చెల్లించిన వారికి పన్నులో 5 శాతం రాయితీ ఇస్తూ ఆస్తి పన్ను చెల్లింపుదారులకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కేతన్ గార్గ్ శనివారం విజ్ఞప్తి చేశారు. ఆదివారం సెలవు రోజైనప్పటికీ చెల్లింపుదారుల సౌకర్యం కోసం నగర పాలక సంస్థలో ఉన్న ట్రెజరీ, అదనపు కౌంటర్లు తెరచి ఉంచేలా చర్యలు చేపట్టినట్టు తెలిపారు. వీఎల్ పురంలోని సచివాలయం–23, ప్రకాష్ నగర్ మీసేవాలో 14, సీతంపేట మీసేవాలో 81, కోటిపల్లి బస్టాండు మీసేవాలో 36, నారాయణపురం సచివాలయం–3, బొగ్గులదిబ్బ సచివాలయం–42, బర్మా కాలనీ సచివాలయం – 89 యథావిధిగా పనిచేస్తాయని తెలిపారు.

అప్రకటిత విద్యుత్ కోతలతో అవస్థలు

- కరెంటు కోతలు లేవంటున్న అధికారులు
- పగలు, రాత్రి వేళల్లో అనధికారికంగా కోతలు
- మరమ్మతుల పేరుతో 6 నుంచి 7 గంటల పాటు సరఫరా నిలుపుదల
- గ్రామాల్లో అస్తవ్యస్తంగా విద్యుత్ స్తంభాలు, లైన్లు



పెరవలి సబ్‌స్టేషన్



లంకమాలపల్లిలో విద్యుత్ స్తంభాన్ని అల్లుకున్న పాదులు



ఖండవల్లిలో విద్యుత్ స్తంభం, తీగలను అల్లుకున్న పాదులు



కొవ్వూరులో విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

పెరవలి: పగలు మరమ్మతుల పేరుతో.. రాత్రిళ్లు అప్రకటిత కోతలతో విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ప్రజలు విలవిల్లాడిపోతున్నారు. కరెంటు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు కోత విధిస్తారో తెలియక ప్రజలు నానా పాట్లు పడుతున్నారు. ఒకవైపు ఎండలు మండిపోతుంటే మరో వైపు కరెంటు లేక ప్రజలు నానా పాట్లు పడుతున్నారు. విద్యుత్ కోత అనందరం ఎప్పుడు పునరుద్ధరిస్తారన్న సమాచారం కోసం సబ్‌స్టేషన్‌కు ఫోన్లు చేస్తున్నా సమాధానం చెప్పేనాథుడే కరువయ్యారు. మంత్రులు, ఎమ్మెల్యేల పర్యటించినప్పుడు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉంటోందని, ఇతర సమయాల్లో యథావిధిగా కోతలు తప్పటం లేదని వినియోగదారులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. మరమ్మతుల పేరుతో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని విద్యుత్ శాఖాధికారులు ప్రకటించి, ఎప్పుడో సాయంత్రం 3 లేక 4 గంటలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తున్నారు. దీంతో వేళాపాళా లేని విద్యుత్ సరఫరాతో పలు ఫాండ్రీలు, కార్ఖానాలు, వెల్డింగ్ షాపుల్లో పనులు నిలిచిపోతున్నాయని కార్మికులు, యజమానులు, హోటళ్ల నిర్వాహకులు, నూనె, కారం, పిండి మిల్లులు యజమానులు గగ్గోలు పెడుతున్నారు.

చెట్ల కొమ్మల తొలగింపు పేరుతో సరఫరా నిలిపివేత

చెట్ల కొమ్మల తొలగింపు పేరుతో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్న అధికారులు కేవలం ఫ్యాక్టరీలకు వెళ్లే హైటెన్షన్ విద్యుత్ లైన్లు తప్ప మరో లైన్ల మరమ్మతులు చేపట్టడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఎందుకంటే గ్రామాల్లోని గృహావసరాలకు ఏర్పాటు చేసిన లైన్లు, విద్యుత్ స్తంభాలపై పాదులు, తీగలు అల్లుకున్నా పట్టించుకున్న దాఖలాల్లేవు.

ప్రతి రోజూ విద్యుత్ కోతలు

ప్రతి రోజూ రెండు నుంచి మూడు గంటలు విద్యుత్ కోతలు అమలు చేస్తున్నామంటున్న అధికారులు వాస్తవంగా పగలు, రాత్రి వేళల్లో 6 నుంచి 7 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. దీనిపై ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ విద్యుత్ అధికారులు చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ప్రధాన లైన్ తీగ తెగిపోతే సాయంత్రం వరకు విద్యుత్ పునరుద్ధరణ చేయలేదని దీని వలన చాలా ఇబ్బందులు పడ్డామని విమర్శించారు. ఇవేమీ పట్టించుకోకుండా విద్యుత్ కోతలు కొనసాగిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెరవలి మండలంలో నెల రోజులుగా ప్రతి రోజు మరమ్మతుల పేరుతో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారు. ప్రస్తుతం ఇదే పరిస్థితి కొనసాగితే రాబోయే మే నెలలో అసలు విద్యుత్ సరఫరా ఉంటుందా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. దీనిపై పెరవలి ఏఈ డేవిడ్ నిశ్చల్‌ను వివరణ కోరగా కరెంటు కోతలు ఏమీ లేవని ఎప్పుడైనా విద్యుత్ లైన్‌లో సమస్యలు తలెత్తితే తప్ప విద్యుత్ సరఫరా నిలుపుదల చేయడం లేదని అన్నారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపట్టినప్పుడు మాత్రమే సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఆయన తెలిపారు.

విద్యుత్ సబ్ స్టేషన్‌లో సాంకేతిక లోపం

కొవ్వూరు: పట్టణంలో విద్యుత్ సరఫరా కోత విధించడంతో జనం వేసవి ఉక్కపోతతో అవస్థలు పడ్డారు. పట్టణంలో 130 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ (సీటీ)లో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8.45 గంటల వరకు సరఫరా నిలిపివేశారు. సుమారు గంటలకు పైగా సరఫరా నిలిచివేయడంతో పట్టణంలో అంధకారం అలుముకుంది. ప్రత్యామ్నాయంగా సగ్గొండ లైన్ నుంచి సరఫరాను పునరుద్ధరించారు. సాయంత్రం వ్యాపారాలు కొనసాగే సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడడంతో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులను చవిచూశారు. ప్రధానంగా చిరు వ్యాపారులు కరెంటు సరఫరా లేకపోవడంతో పడరాని పాట్లు పడ్డారు. రాత్రి పొద్దుపోయేంత వరకు విద్యుత్ శాఖ సిబ్బంది ట్రాన్స్‌ఫార్మర్ పునరుద్ధరణ పనుల్లో నిమగ్నమయ్యారు. సాధ్యమైనంత త్వరగా సరఫరా పునరుద్ధరించేందుకు ప్రయత్నిస్తున్నామని విద్యుత్ శాఖ ఏడీ కృష్ణ నాయక్ తెలిపారు.

చిరుధాన్యాలు సాగు చేయాలి



కాపవరంలో ఉత్తమ రైతులను సన్మానిస్తున్న జిల్లా ప్రకృతి వ్యవసాయ కోఆర్డినేటర్ సాకా రామకృష్ణ

పెరవలి: భావి తరాల భవిష్యత్తు కోసం, భూసారాన్ని పెంచడం కోసం ప్రతి ఒక్కరూ సేంద్రియ వ్యవసాయం చేపట్టాలని జిల్లా కో ఆర్డినేటర్ సాకా రామకృష్ణ తెలిపారు. మండలంలోని మల్లేశ్వరం, కాపవరం గ్రామాల్లో వెలుగు సిబ్బంది, రైతులతో శనివారం సేంద్రియ వ్యవసాయంపై అవగాహన ర్యాలీ నిర్వహించి, నవధాన్యాల కిట్‌లను అందించి ఉత్తమ రైతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే సేంద్రియ వ్యవసాయం 45 వేల ఎకరాలకు చేరింది. ఇది మరింత పెరగాలని తెలిపారు. పంట భూములు సురక్షితంగా ఉండాలంటే ఇప్పటి నుంచి సేంద్రియ వ్యవసాయం ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలన్నారు. రసాయన ఎరువుల వినియోగంతో పంట భూములు క్రమేణా సారం కోల్పోతాయని వివరించారు. భూసారం వృద్ధికి రైతులు మూడవ పంటగా చిరు ధాన్యాలను సాగు చేయాలని సూచించారు. పచ్చిరొట్ట పైర్లు సాగుకి మండలంలో ఖండవల్లి, ముక్కామల, కాపవరం, మల్లేశ్వరం, పెరవలి గ్రామాలను ఎంపిక చేసి 30 రకాల చిరు ధాన్యాల విత్తనాలను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మోడల్ మేకర్ ఉమా మహేశ్వరరావు, యూనిట్ ఇన్‌చార్జి సూర్యనారాయణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వెంకటకృష్ణ, ప్రశాంతి, రమణ పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు మాజీ మంత్రి పరామర్శ



పోతినీడుపాలెంలో కరుణాకర్‌ను పరామర్శిస్తున్న మాజీ హోంమంత్రి తానేటి వనిత

నల్లజర్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో బాధిత కుటుంబాలను మాజీ హోంమంత్రి, వైఎస్సార్ సీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు తానేటి వనిత శుక్రవారం పరామర్శించారు. పోతినీడుపాలెంలో గ్రామకమిటీ అధ్యక్షుడు ఆలపాటి కరుణాకర్ బ్రెయిన్ చికిత్స చేయించుకున్నారు. ఆయనను వనిత పరామర్శించారు. ప్రకాశరావుపాలెంలో కాలికి శస్త్రచికిత్స చేయించుకున్న స్థానిక నాయకుడు కరుటూరి లక్ష్మీగణేశ్వరరావును, అదే గ్రామంలో కరుటూరి నాగభూషణం, తాతిన కాశీ విశ్వేశ్వరావును, కొత్తగూడెంలో శిఖ లక్ష్మణరావు, శిఖ దుర్గారావు, అదే గ్రామంలో ఇటీవల మృతి చెందిన విజయకనకరాజు కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించారు. ఆయా కార్యక్రమాల్లో ఆమెతో పాటు మండల కన్వీనర్ వెల్లంకి వెంకటసుబ్రమణ్యం, నాయకులు బంక అప్పారావు, ముప్పిడి వెంకటరత్నం, అచ్యుత శివాజీ, పిచ్చుకల ప్రసాద్, తొమ్మండ్రు రవి, పంది సత్యనారాయణ, పంది రావు, సయ్యద్, మునాఫ్, అందుగుల వెంకటేశ్వరావు, శెనగన సతీష్, గుడిశే వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతలకు మాజీ మంత్రి వనిత పరామర్శ

దేవరపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో మాజీ హోం మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యురాలు, నియోజకవర్గ సమన్వయకర్త తానేటి వనిత శనివారం పర్యటించి పలువురు పార్టీ నాయకులను పరామర్శించారు. కాలుకు సర్జరీ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న కురుకూరు ఎంపీటీసీ సభ్యుడు కరుటూరి నిత్యానందాన్ని వనిత పరామర్శించారు. దుద్దుకూరులో మార్లపూడి చక్రవర్తిని, విప్పర్తి నాని కటుంబ సభ్యులను, మోకాళ్లకు సర్జరీ చేయించుకున్న కొండ రామకృష్ణ, సర్జరీ చేయించుకున్న పాపోలు కృష్ణ, రామన్నపాలెంలో మిరాయాల సుబ్బరాజు కుటుంబ సభ్యులను, రాపాక కిట్టయ్య కుటుంబ సభ్యులను, చిన్నాయగూడెంలో మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యురాలు షేక్ అస్మత్ ఉన్నీషా, దేవరపల్లిలో సోషల్ మీడియా కన్వీనర్ కల్లేపల్లి మాణిక్యం, కురుకూరు గ్రామ కమిటీ అధ్యక్షులు ఆచంట శ్రీనివాస్‌ను మాజీ మంత్రి వనిత పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ కేవీకే దుర్గారావు, ఏఎంసీ మాజీ చైర్మన్లు గన్నమని జనార్ధనరావు, నరహరిశెట్టి రాజేంద్రబాబు, మండల పార్టీ అధ్యక్షులు కూచిపూడి సతీష్, మాజీ ఎంపీపీ మేడిబోయిన గంగరాజు, ఎంపీటీసీ సభ్యురాలు నాగప్రసన్న, సర్పంచ్ సున్నం వర ప్రసాద్, పార్టీ నాయకులు గడా రాంబాబు, నిమ్మగడ్డ కృష్ణ, ఎంపీటీసీ సభ్యులు సత్తి జగదీశ్వరరెడ్డి, మండల మహిళా కన్వీనర్ కడలి హైమావతి, ఆచంట అనసూయ, ఆచంట సురేష్ పాల్గొన్నారు.

త్వరితగతిన గృహ నిర్మాణాలు చేపట్టండి



పోతవరంలో గృహ నిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి నిర్మలకుమారి

నల్లజర్ల: మండలంలో పూర్తి చేయవలసిన ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా మత్స్యశాఖ అధికారి టి.నిర్మలకుమారి కోరారు. శనివారం మండలంలోని పోతవరంలోని గృహ నిర్మాణాల లేఅవుట్‌ను పరిశీలించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రభుత్వం అదనపు ఆర్థికసాయాన్ని అందిస్తున్నట్టు చెప్పారు. ఇప్పటికే జిల్లాలో 4వేల మంది లబ్దిదారులు ముందుకు వచ్చినట్టు చెప్పారు. ఈ ప్రభుత్వం వచ్చి సంవత్సర కాలం ముగుస్తున్న దృష్ట్యా వేడుకగా గృహప్రవేశాల కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ మేరకు క్షేత్రస్థాయి అధికారులు తగు చర్యలు చేపట్టాలన్నారు. మండలంలో 313 గృహాలు నిర్మాణం చేపట్టడం జరిగిందని ఇందులో 63 ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, మరో 163 ఇళ్లు బేస్‌మెంట్ స్థాయిలోను, మరో 33 రూఫ్‌లెవల్‌లోనూ, 18 లింటల్ స్థాయిలోను, 36 రూఫ్ కంప్లీట్ స్థాయిల్లోనూ ఉన్నట్టు చెప్పారు. ఆమెతో పాటు ఎంపీడీఓ సింహాద్రి, ఏఈ సాయా, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.

ఈస్టర్ పండగకు ఏర్పాట్లు

- ఈస్టర్ పర్వదినానికి సమాధుల ముస్తాబు
- పూలు, రంగులతో అలంకరణ



పూర్వీకుల సమాధులను శుభ్రం చేస్తున్న బంధువులు

సీటీఆర్ఐ: ఏసుక్రీస్తు శిలువ మరణం పొంది తిరిగి లేచిన రోజైన ఈస్టర్ (పునరుత్థాన పండగ) పర్వదినాన్ని పురస్కరించుకుని నగరంలోని సమాధుల తోటలను ముస్తాబు చేశారు. తమను వీడి పరలోకగతులైన ఆత్మీయ బంధు మిత్రులు సమాధులను వారి కుటుంబ సభ్యులు పూలు, రంగులతో ముస్తాబు చేశారు. క్రైస్తవులందరూ ఆదివారం తెల్లవారుజామున పువ్వులు, కొవ్వొత్తులు వెలిగించి సమాధుల తోటలో ప్రార్థనలు నిర్వహించనున్నారు. అందుకును గుణంగా సమాధులను శుభ్రంగా కడిగి, వాటికి రంగులు పూచి, పూలతో అలంకరించారు. తెల్లవారుజాము వరకు ఈ అలంకరణ ప్రక్రియ చేశారు. బైపాస్ రోడ్డులో ఉన్న లూథరన్ సమాధుల తోటలలోనూ, క్వారీ మార్కెట్ వద్ద గల సమాధుల వద్ద అన్ని ఏర్పాట్లు చేశారు.

తాడిపర్రులో ఉచిత వైద్య శిబిరం

ఉండ్రాజవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా మండలంలో తాడిపర్రులో చైతన్య యూత్ ఆధ్వర్యంలో తణుకు శ్రీపావని హాస్పిటల్ వైద్యులతో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉపాధి హామీ క్షేత్ర సహాయకురాలు కత్తుల జ్యోతిరత్నం ప్రారంభించారు. ఈ శిబిరంలో సుమారు 137 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైతన్య యూత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి విజయం దిశగా అడుగులు వేయాలి

సీటీఆర్ఐ: ప్రతి విద్యార్థి తన తప్పులను తెలుసుకుని, శక్తి సామర్థ్యాన్ని పెంచుకుని విజయం దిశగా అడుగు వేయాలని రాజమండ్రి నగర శాసన సభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల యాన్యువల్ అండ్ స్పోర్ట్స్ డే సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడాతూ గెలుపు ఓటమి ఎప్పుడూ శాశ్వతం కాదని పట్టుదలతో ప్రయత్నిస్తే విజయం సాధించవచ్చని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి రమణమూర్తి, డిగ్రీ కళాశాల ఆర్జేడీ డాక్టర్ ఎస్ శోభారాణి, వైస్ ప్రిన్సిపాల్ ఎ.శరత్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులందరూ అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా నగదు పురస్కారం అందించారు. ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థుల ఆంధ్ర నాట్యం అందరినీ అలరించింది.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

కొవ్వూరు: దొమ్మేరు గ్రామానికి చెందిన లంక నాగ శ్రీసత్య సాయికుమార్ (22) శనివారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సాయికుమార్ ఎంసీఏ మొదటి సంవత్సరం చదువుతున్నట్లు బంధువులు చెబుతున్నారు. తల్లిదండ్రులిద్దరూ ఆసుపత్రి పనిపై బయటికి వెళ్లారు. దీంతో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో రాత్రి తొమ్మిది గంటల సమయంలో సాయికుమార్ గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత ఇంటికి వచ్చిన స్నేహితుడు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పట్టణ సీఐ పి.విశ్వం ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. మృతుడికి ఇద్దరు వివాహమైన సోదరీమణులున్నారు. తల్లిదండ్రులు ఉన్నారు. సాయికుమార్ ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులపై పోలీసులు ఆరా తీస్తున్నారు.



ప్రజల భాగస్వామ్యంతోనే స్వర్ణాంధ్ర సాధ్యం



కాల్ధారిలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న మంత్రి దుర్గేష్

ఉండ్రాజవరం: ప్రజల భాగస్వామ్యంతోనే స్వర్ణాంధ్ర సాధ్యమని ఏపీ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మండలంలో కాల్ధారి గ్రామంలో శనివారం స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి దుర్గేష్ ప్రజలతో స్వచ్ఛాంధ్రప్రదేశ్ సాధనకు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఈ–వేస్ట్ కలెక్షన్ సెంటర్‌ను మంత్రి ప్రారంభించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ఫౌల్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షులు కోమట్లపల్లి వెంకట సుబ్బారావు, ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో ఆంజనేయ శర్మ, తహసీల్దార్ పీఎన్‌డీ.ప్రసాద్, సర్పంచ్ చీపుళ్ల కుమారి, ఎంపీటీసీ సభ్యుడు చెట్టే నవీన్, ఉపసర్పంచ్ ఈర్పిన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో పర్యావరణానికి హాని

నిడదవోలు : స్వర్ణాంధ్ర –స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ వ్యర్థాల వల్ల పర్యావరణానికి కలిగే హానిపై శనివారం నిడదవోలు మున్సిపాలిటీ ఉద్యోగులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ ర్యాలీని ప్రారంభించి మాట్లాడుతూ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ షాపు యజమానులు ఎలక్ట్రికల్ వ్యర్థాలను ఈ– వేస్ట్ కలెక్షన్ సెంటర్ సిబ్బందికి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పలు షాపుల వద్దకు వెళ్లి యజమానుల నుంచి 50 కిలోల ఎలక్ట్రికల్ వ్యర్థాలను సేకరించారు. మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన ఈ –వేస్ట్ కలెక్షన్ సెంటర్ నుంచి 100 కిలోల ఎలక్ట్రికల్ వ్యర్థాలను సేకరించారు. మున్సిపల్ కమిషనర్ టి. కృష్ణవేణి, కౌన్సిలర్లు, మున్సిపల్ శానిటేషన్, సచివాలయ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కుబడిగా 'స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర'

పెరవలి: స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమం పెరవలి మండలంలో మొక్కుబడిగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తప్ప మిగిలిన చోట్ల ఎక్కడా ఈ కార్యక్రమం నిర్వహించిన దాఖలాల్లేవు. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ వ్యర్థాలను తీసుకురావాలని గ్రామాల్లో టాంటాం వేయించి అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అచ్యుత కుమారి రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, అధికార పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వ్యర్థాల నిర్వహణపై అవగాహన సదస్సు

తాళ్లపూడి: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయల వద్ద శనివారం స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ– వ్యర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పలు గ్రామాల్లో గ్రామస్తులు, విద్యార్థులతో కలసి అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ మోహనభారతి, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలందరి సహకారంతో స్వచ్ఛాంధ్ర సాకారం

నిడదవోలు రూరల్: ప్రజలందరి సంపూర్ణ సహకారంతోనే స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యం సాకారమవుతుందని మండల ప్రత్యేకాధికారి ఎ.దుర్గేష్ అన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని సమిశ్రగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం ఎలక్ట్రానిక్ వ్యర్థాల వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ దేశాబత్తుల జ్యోత్స్నప్రియాంక, ఎంపీడీఓ డి.లక్ష్మీనారాయణ, తహసీల్దార్ బి.నాగరాజునాయక్, పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు, ఏవో జి.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాల పునర్వినియోగంపై దృష్టి

కొవ్వూరు: ఎలక్ట్రానిక్ వ్యర్థాల పునర్వినియోగంపై దృష్టి సారించాలని డివిజనల్ కో–ఆపరేటివ్ అధికారి వి.కృష్ణకాంత్ సూచించారు. పట్టణంలో డివిజనల్ కో–ఆపరేటివ్ కార్యాలయంలో స్వచ్ఛ దివస్‌లో భాగంగా నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాగంటి చలపతిరావు, వీరశెట్టి రాజా వర ప్రసాద్ పాల్గొన్నారు.